క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం రుచిగా అందించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పథకం డైరెక్టర్ వెంకట్రాజు

రంగంపేట: మధ్యాహ్న భోజనం రుచిగా, పుష్టికరంగా ఉండేలా అందజేయాలని పథకం డైరెక్టర్ వి.వెంకట్రాజు అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ పాఠశాలలో ఎంఈఓ పి.మధుసూదనరావు ఆధ్వర్యంలో భోజనం తయారీ నిర్వాహకుల ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహకులు, సహాయకులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతులకు నివాళులర్పిస్తున్న జక్కంపూడి రాజా, గూడూరు శ్రీనివాస్

రాజానగరం: ఏడీబీ రోడ్డుపై వడిశలేరు వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో మరణించిన మండలంలోని రఘునాధపురానికి చెందిన వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు వారు పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు.

ఆర్టీఐహెచ్ ఏర్పాట్ల పరిశీలన



ఆర్టీఐహెచ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, కమిషనర్ గార్గ్, ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్: ఈ నెల 10 లేదా 11 తేదీల్లో ధవళేశ్వరం జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సీఎం చంద్రబాబుచే ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం సాయంత్రం ఈ భవన ఏర్పాటు పనులను నగర కమిషనర్ కేతన్ గార్గ్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎస్పీ డి.నరసింహకిషోర్‌లతో కలిసి పరిశీలించి పనుల వేగవంతంపై అధికారులకు సూచనలిచ్చారు. ఈ హబ్ నిర్వహణలో గ్రీన్ కో ఎనర్జీ, ఓఎన్జీసీ, గెయిల్, అవంతి తదితరులు ప్రమోటర్లుగా ఉంటారని ఆమె వెల్లడించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ రాజమండ్రి రూరల్ నియోజక వర్గం పరిధిలో ఈ హబ్ ఏర్పాటుపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

- పండగకు ముస్తాబైన మసీదులు
- పవిత్ర ఖుర్బానీ, ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు



పందలపాకలో నమాజు చేస్తున్న ముస్లింలు



పందలపాకలో బక్రీద్ పండుగకు ముస్తాబవుతున్న మసీద్

బిక్కవోలు: త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగకు ముస్లింలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం జిల్‌హజ్ మాసంలోని (చంద్రోదయం ఆధారంగా) 10వ రోజున అనగా శనివారం ఈద్ ఉల్ జుహా (బక్రీద్) జరుపుతారు. అల్లా కోసం పూర్వ ప్రవక్త హజరత్ ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్ ప్రాణాన్ని త్యాగం చేసేందుకు సిద్ధపడి దైవ పరీక్షలో నెగ్గిన సందర్భాన్ని పురస్కరించుకుని ముస్లింలు బక్రీద్‌ను త్యాగ దినంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ముస్లింలు మసీదులకు వెళ్లి ప్రత్యేక నమాజ్ చేసి బంధుమిత్రులను కలిసి శుభాకాంక్షలు చెప్తారు. రంజాన్ సందర్భంగా దానాలు చేసే ముస్లింలు బక్రీద్ రోజున ఖుర్బానీ ఇస్తారు.

ఇదీ చరిత్ర

ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం నిద్రిస్తున్న సమయంలో తన కుమారుడిని త్యాగం చేస్తున్నట్టు కల వస్తుంది. ఇలా మూడు సార్లు కల రావడంతో.. ఇదే విషయాన్ని తన కుమారుడు ఇస్మాయిల్‌కు చెబుతారు. దైవ విశ్వాసి అయిన హజ్రత్ ఇస్మాయిల్ నిస్సంకోచంగా అందుకు అంగీకరించి, ప్రాణత్యాగానికి సిద్ధమవుతారు. దైవానుగ్రహం కోసం కుమారుడిని సైతం ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడిన ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం త్యాగ నిరతిని, దైవంపై ఉన్న అచంచల విశ్వాసానికి అల్లా ప్రసన్నమవుతారు. కుమారుడిని ఖుర్బానీ ఇచ్చే సమయంలో స్వర్గం నుంచి ఓ గొర్రె(దుంబ)ను తెచ్చి ఆ ప్రదేశంలో ఉంచుతారు. దీంతో అల్లా ఆదేశం ప్రకారం ఖుర్బానీ సంపూర్ణమవుతుంది. ఈ చారిత్రక ఘటన నేపథ్యంలో మహా ప్రవక్త హజ్రత్ మొహమ్మద్(స.అ.వ.) నిర్దేశం మేరకు బక్రీద్ పండుగను జరుపుకోవడం ముస్లింలకు ఆచారంగా వస్తోంది.

ఖుర్బానీ

బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఖుర్బానీ ఇచ్చిన జంతువు మాంసాన్ని మూడు భాగాలు చేస్తారు. ఓ భాగాన్ని పేదలకు, రెండో భాగాన్ని బంధుమిత్రులకు, మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. ఇందులో ఏ మాత్రం వ్యత్యాసం రాకూడదు.

హజ్ యాత్ర

ముస్లింలు ఈ మాసంలోనే హజ్ యాత్ర చేస్తారు. పవిత్ర స్థలం మక్కాను సందర్శించడానికి ముస్లింలు ఇష్టపడతారు. సౌదీ అరేబియాలోని మక్కాకు వెళ్లి, మస్‌జిద్ అల్ హరమ్‌లోని కాబా చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణ చేస్తారు. బక్రీద్ పండుగ రోజు ముస్లింలు ఈద్గాకు చేరుకుని సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం ఈద్ ముబారక్ అంటూ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకొంటారు.

సందడి షురూ

బక్రీద్ సందర్భంగా పొట్టేళ్లు, గొర్రెలు, మేకల విక్రయాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఖుర్బానీ కోసం ఇప్పటికే కొందరు గుంటూరు, హైదరాబాద్, విజయనగరం నుంచి ప్రత్యేకంగా పొట్టేళ్లను తెచ్చుకున్నారు. మరి కొందరు గోకవరం, ఇల్లపల్లి తదితర ప్రాంతాల నుంచి వాటిని తెచ్చుకున్నారు. స్థానికంగా ఒక్కో పొట్టేలు రూ.10 వేల నుంచి రూ.30 వరకు ధర పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, బలభద్రపురం, పందలపాక, రంగంపేట, జి.మామిడాడ, పెదపూడి, సింగపల్లి గ్రామాల్లో బక్రీద్ ఘనంగా జరుగుతుంది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సుమారు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పొట్టేళ్ల వ్యాపారం జరుగుతుందని అంచనా.

ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు సిద్ధం

నియోజకవర్గం పరిధిలోని అనపర్తి, రామవరం, కుతుకులూరు, బిక్కవోలు, పందలపాక, బలభద్రపురం, రంగంపేట, ముకుందవరం, సింగంపల్లి, గొల్లల మామిడాడ, సంపర తదితర గ్రామాల్లోని మసీదుల్లో శనివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

త్యాగాల పండగ



బక్రీద్ పండుగ మనిషికి దైవభీతిని, త్యాగ నిరతిని తెలియజేస్తుంది. అందుకే ఈ పండుగను త్యాగాల పండుగ అంటారు. కుటుంబ పెద్ద పేరున, ఉద్యోగ, వ్యాపారాలు చేసి సంపాదిస్తున్న వారు కచ్చితంగా ఖుర్బానీ ఇవ్వాలి. – షేక్ రహిమన్, ముస్లిం పెద్దలు, పందలపాక

ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ



బక్రీద్ సందర్భంగా ప్రతి ముస్లిం విధిగా ఖుర్బానీ ఇచ్చి, ఆ మాంసాన్ని పేదలకు పంచడం ఆనవాయితీ. అలాగే ఈ పండుగ సందర్భంగా ఆర్థిక స్తోమత ఉన్న ముస్లింలు తమ జీవితకాలంలో ఒక్క సారైనా అతి పవిత్రమైన మక్కాను సందర్శించి ముక్తిని పొందాలి. – మౌలానా షేక్ గులాం గౌసీరిజ్వి, జామియా మసీద్ గురువు, పందలపాక

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు



విజ్ఞాన తరగతులకు హాజరైన విద్యార్థులు

సీతానగరం: స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు 33వ రోజుకు చేరుకున్నాయి. గురువారం విద్యార్థులకు కథలు చెప్పడం, వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. చదవడం మాకిష్టంలో భాగంగా «పిల్లి కుక్క» అనే బాలల కథను చదివించారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత హెచ్ఎం బి.భాస్కరరావు, ఉపాధ్యాయులు జి.అశోక్ కుమార్, విశ్రాంత సహాయ సంక్షేమ అధికారి ఓఎస్ సురేష్‌బాబు పాల్గొని చదరంగం, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

నల్ల బజార్‌లోకి రేషన్ బియ్యం

సీతానగరం: మండలంలో రేషన్ బియ్యం నల్ల బజార్‌కు తరలిపోతోంది. గురువారం ముగ్గళ్ల నుంచి సీతానగరం వైపు ద్విచక్ర వాహనాలపై సుమారు నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా స్థానికులు గుర్తించారు. పీడీఎఫ్ బియ్యం పక్కదారి పడుతున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రేషన్ షాపుల వద్దకు రేషన్ తీసుకోవడానికి వచ్చిన వారి నుంచి కిలో బియ్యం రూ.14కు కొనుగోలు చేసి, ఇతర ప్రాంతాల వారికి సుమారు రూ.23 విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. సంబంధిత అధికారులు రేషన్ దుకాణాలపై దృష్టిచారించాలని, నల్ల బజార్‌కు తరలిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలలు తెరిచే నాటికి స్టూడెంట్ కిట్లు

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- కోరుకొండ జెడ్పీ హైస్కూల్‌లో అటల్ టింకరింగ్‌ల్యాబ్ పరిశీలన
- పరిశోధనలను వివరించిన విద్యార్థులు



కోరుకొండ హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి



దివాన్‌చెరువులోని విద్యా మిత్ర కిట్ల స్టాక్ పాయింట్‌ని పరిశీలిస్తున్న డైరెక్టర్ ప్రతాపరెడ్డి

కోరుకొండ: పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్లు అందజేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కోరుకొండలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టూడెంట్ కిట్ రూమ్‌లోని కిట్ల నాణ్యతను, అటల్ టింకరింగ్‌ల్యాబ్ పరిశీలించారు. ల్యాబ్‌లో విద్యార్థులు చేసిన పరిశోధనల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఇచ్చిన వివరణకు కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. మండలంలోని 55 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఆరు వేల స్టూడెంట్ కిట్లు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట డీఈఓ కె.వాసుదేవరావు, తహసీల్దార్ సుస్వాగతం, ఎంఈఓలు టి.కుశలవదొర, ఎం.సుజాత, స్కూల్ టీచర్ ఆనంద్ పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్లు సిద్ధం చేయండి

రాజానగరం: పాఠశాలలను తెరిచేనాటికి విద్యా మిత్ర కిట్లు ఆయా పాఠశాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఎస్సీఈఆర్టీ అడల్ట్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రతాపరెడ్డి ఎంఈఓలకు సూచించారు. మండలంలోని దివాన్‌చెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్ల స్టాక్ పాయింట్‌ని గురువారం ఆయన సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్, సర్వ శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి గౌరీశంకర్, సీఆర్పీలు ఉన్నారు.

రంగంపేటలో..

రంగంపేట: మండలంలోని ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు ఇచ్చే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను డైరెక్టర్ ప్రతాపరెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ పి.మధుసూదనరావు, జిల్లా సమగ్ర శిక్ష ఏఎంఓ గౌరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: తనను ఆటో ఎక్కించి ఇంటికి వెళ్లిన తన భర్త కనిపించడం లేదని వీరభద్రపురం ఆవరోడ్ వాంబే కాలనీకి చెందిన ఆగ్రవరపు దుర్గ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం వాంబేకాలనికి చెందిన 25 ఏళ్ల బట్టు నాగేశ్వరరావు తాపీపని చేస్తుంటాడు. అతని భార్య దుర్గ ఇళ్లల్లో పనులు చేస్తుంది. ఈనెల 3వ తేదీ ఉదయం 8 గంటలకు దుర్గను పనికి ఆటో ఎక్కించి నాగేశ్వరరావు ఇంటికి వెళ్లిపోయాడు. దుర్గ పని ముగించుకుని ఉదయం 11 గంటలకు ఇంటికి రాగా తన భర్త కనిపించ లేదని, పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

కంబాలచెరువు: స్థానిక గోదావరి నది ధోబీ ఘాట్ వద్ద గురువారం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మండపేట మండలం ద్వారపూడికి చెందిన ఎం.వీరబాబు (40)గా పోలీసులు గుర్తించారు. ఈ నెల 4న రాజమహేంద్రవరంలోని తన మేనల్లుడు వినోద్‌కుమార్‌కు ఇంటికి వస్తున్నానని ఫోన్ చేసి చెప్పాడు. అయితే అతను ఇంటికి రాలేదు. కాగా ధోబీఘాట్ వద్ద మగ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికుల ద్వారా తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దాన్ని వెలికితీసి దర్యాప్తు తీశారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ సమాచారాన్ని పోలీసులు వాట్సాప్ గ్రూప్‌ల్లో పెట్టగా వీరబాబు కోసం గాలిస్తున్న అతని కుటుంబీకులకు విషయం తెలిసి పోలీసు స్టేషన్‌కు వచ్చి ఆధారాలు అందజేసారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబీకులకు అప్పగించారు. ద్వారపూడిలో దుస్తుల వ్యాపారం చేసే వీరబాబు అప్పులపాలు కావడంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తలుపులమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



బూరులమ్మ తల్లి



తలుపులమ్మ తల్లిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ: మండలంలోని నిడిగట్ల గ్రామంలోని తలుపులమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగరం రాష్ట్రఅధ్యక్షుడు జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బూరులమ్మ విగ్రహ ప్రతిష్ఠ

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు శివారు కొంకుదురు సావరం గ్రామంలో బూరులమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. జీర్ణావస్థకు చేరిన ఆలయాన్ని స్థానికులు, దాతల సహకారంతో సుమారు రూ.15 లక్షలతో కొత్తగా నిర్మించారు. మూడు రోజులు అమ్మవారి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేసి అనంతరం ప్రతిష్ఠించారు. అనంతరం అన్నసమారధన చేశారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాతకు ప్రేమతో..



బలభద్రపురంలో తాతకు తులాభారం వేస్తున్న కుటుంబ సభ్యులు

బిక్కవోలు: సాధారణంగా తాతలు, అమ్మమ్మ, నానమ్మలు వారి మనవళ్లో, మనవరాళ్లకో వారి శ్రేయస్సు కోరుతూ దేవుళ్లకు తులాభారాలు వేయిస్తారు. కానీ మండలంలోని బలభద్రపురంలో ఆంధ్రా శిరిడీసాయి మందిరం వద్ద తమ తాత ఆయురారోగ్యాలతో తులతూగాలని ఆయన మనవళ్లు తులాభారం వేసి తమ ప్రేమను చాటుకున్నారు. రంగంపేట మండలం కొత్త వీరంపాలెం గ్రామానికి చెందిన ఉద్దండరావు నాగేశ్వరరావు కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నారు. ఆయన ఆరోగ్యం కుదుటపడడంతో ఆయన మనవళ్లు పటికబెల్లంతో తులాభారం వేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి మొద్దు నిద్రకు పెద్ద కుదుపు

- వెన్నుపోటు దినం విజయవంతంపై మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి
- సహకరించిన అందరికీ కృతజ్ఞతలు



అనపర్తి: ఏడాది కాలంగా సుష్క వాగ్దానాలు, అమలుకు వీలుకాని హామీలతో ప్రజలను మభ్యపెడుతూ సూపర్ సిక్స్ హామీలపై మొద్దు నిద్ర నటిస్తున్న కూటమి ప్రభుత్వానికి బుధవారం వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో జరిగిన వెన్నుపోటు దినం పెద్ద కుదుపు సృష్టించిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతు రాష్ట్రంలో అమలవుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా, సూపర్ సిక్స్ హామీలపై చేస్తున్న కాలయాపనను ప్రభుత్వానికి గుర్తు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు దినం జరిగిందన్నారు. అనపర్తిలో కూడా ఎర్రని ఎండను , విపరీతమైన ఉక్కపోతను సైతం లెక్క చేయకుండా పెద్ద ఎత్తున మహిళలు, పార్టీశ్రేణులు, వేలాదిగా పాల్గొని కూటమి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తిస్తూ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై ఆయన వారికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. కల్లబొల్లి మాటలతో ప్రజలను ఎంతో కాలం మోసం చేయలేరని ప్రజలలో చైతన్యం వస్తే ఎలా ఉంటుందో ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొన్న జన సందోహాన్ని చూస్తే తెలుస్తుందని, అధికార పార్టీ నాయకులకు ముచ్చెమటలు పడుతున్నాయన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కూటమి ప్రభుత్వంపై తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 171 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన ఆదిత్య కళాశాల విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన క్యాంపస్ సెలక్షన్లలో 171 మంది ఉద్యోగాలు సాధించారని ఆ విద్యా సంస్థల సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి గురువారం తెలిపారు. ఆదిత్య విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని, ఐటీ రంగంలో టీసీఎస్ కంపెనీకి 122 మంది, కాగ్నిజెంట్ కంపెనీలో 49 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. ప్రస్తుత విద్యార్థులు విజయాలు సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపస్ సెలక్షన్లలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు, ప్రిన్సిపాల్స్ సీహెచ్ ఫణికుమార్, ఎస్‌కే రెహమాన్, చంద్రశేఖర్ అభినందించారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక సరస్వతీ ఘాట్ సమీపంలోని ఏపీ టూరిజం కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలోని కలుపు మొక్కలను, వ్యర్థ పదార్థాలు, ముళ్ల మొక్కలను తొలగించి, మామిడి, పనస మొక్కలను నాటారు. ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి, పోలుకొండ సాయి, కె.మహేశ్వరి, ఎన్ఎస్ఎస్ నాయకులు సూర్య, వినయ్, సుమ, యశస్వి తదితరులు పాల్గొన్నారు.

జీవనం పర్యావరణహితం కావాలి

- కలెక్టర్ ప్రశాంతి
- నన్నయ వర్సిటీలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- పాల్గొన్న వీసీ ప్రసన్నశ్రీ, అధికారులు



వర్సిటీ ప్రాంగణంలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ ప్రశాంతి, వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ తదితరులు

రాజానగరం: మానవాళి జీవన పయనం పర్యావరణ హితంగా సాగాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు కాలుష్య నియంత్రణకు పూనుకోవాలని, తద్వారా భావితరాలకు మంచి భవితను అందించిన వారవుతారన్నారు. తక్కువ స్థలంలో ఎక్కువ పచ్చదనాన్ని తీసుకువచ్చేలా «అకిరా మియావాకీ» విధానంలో మొక్కలు పెంచే ప్రయత్నం చేద్దామని సూచించారు. కొంత భూమిని కేటాయిస్తే ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పూర్తి సహకారం అందించేలా కృషి చేస్తానన్నారు. వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ప్రకృతిపై మనకు ఎంత హక్కు ఉందో దానిని పరిరక్షించవలసిన బాధ్యత అంతకు మించి ఉందన్నారు. ప్రాంగణంలో ఇప్పటికే సుమారు రెండే వేల మొక్కలను నాటి, వాటికి జియో ట్యాగ్ చేసి, పరిరక్షిస్తున్నామన్నారు. భూగర్భ జాలాల పెంపునకు కూడా ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో కలిసి యూనివర్సిటీ ప్రధాన ముఖద్వారం వద్ద ఆమె కొన్ని మొక్కలను నాటారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, తహసీల్దారు జీఏఎల్ఎస్ దేవి తదితరులు పాల్గొన్నారు.



జీజీయూలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు



బూరుగుపూడి అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో మొక్క నాటుతున్న కేశవరావు

పెదపూడిలో..

పెదపూడి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయం వద్ద పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాడ పీహెచ్‌సీలో..

ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డి.ప్రత్యూష ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలు నాటి వాటిని పెంచడంతో ప్రజలకు ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాడుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జీజీయూలో..

రాజానగరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నన్నయ వర్సిటీ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ ప్రాంగణాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధిపతులు డాక్టర్ వి.సుబ్రహ్మణ్యం, డాక్టర్ కోటేశ్వరరావు, రామ్‌భగవత్‌లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు. రాజానగరం పంచాయతీ ప్రాంగణంలో తక్కువ స్థలంలో ఎక్కువ పచ్చదనాన్ని తీసుకువచ్చేలా 'అకిరా మియావాకీ' విధానంలో మొక్కలను నాటారు. స్థానిక పీహెచ్‌సీ ప్రాంగణంలో ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి మొక్కలను నాటారు. అలాగే మండల విద్యా శాఖ ప్రాంగణంలో ఎస్సీఈఆర్టీ అడల్ట్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రతాపరెడ్డితో కలిసి ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్‌లు మొక్కలను నాటారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

సీతానగరం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి ధ్యేయమని ఎంపీడీఓ ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని కూనవరం పంచాయతీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటి, స్థానికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు ఒక్క మొక్క నాటాలని కోరారు. ముఖ్య అతిథిగా జనసేన స్టేట్ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

బిక్కవోలు: మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకష్ణారెడ్డి అన్నారు. గురువారం తొస్సిపూడి లాకుల వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలోని ఎంపీపీ తేతలి సుమ, సర్పంచి కొవ్వూరి సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో మానవాళికి జీవం

కోరుకొండ: మొక్కలు మానవాళికి ప్రాణవాయువు ఇస్తాయని బూరుగుపూడి పీఏసీఎస్ చైర్మన్ కంటే నాగేశవరావు అన్నారు. గురువారం వనమహోత్సవం సందర్భంగా బూరుగుపూడి అంగన్‌వాడీసెంటర్ ప్రాంగణంలో ఆయన మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 2,640 మొక్కలు నాటినట్టు తెలిపారు. నేరేడు, జామ, వేప, తొగడ తదితర మొక్కలను నాటినట్టు తెలిపారు. బూరుగుపూడి పంచాయతీ కార్యదర్శి టి.జాకబ్‌రాజు ఆధ్వర్యంలో 300 మొక్కలు నాటారు.